నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
శుక్రవారం | సెప్టెంబర్ 27, 2024 | www.navatelangana.com

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్య అధికారి పరుశురాం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని లైబ్రరీలు, ప్రయోగశాలను, తరగతి గదులను పరిశీలించారు. అలాగే కళాశాల కార్యాలయ సిబ్బంది పని తీరుపై సమీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, క్రమం తప్పకుండా ఎంసెట్ తరగుతులు నిర్వహించాలని అధ్యాపకులను కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌతం, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నవీన్, చిన్నయ్య విఠల్, ప్రమీల, సాయినాథ్, హరీశ్ పాల్గొన్నారు.



రెండెద్దులు, ఆవు మృత్యువాత

నవతెలంగాణ-సారంగాపూర్

వాగులో రెండెద్దులు, ఆవు కొట్టుకుపోయి మృత్యువాత పడ్డాయి. తాంద్ర(జి) గ్రామానికి చెందిన రాథోడ్ అరవింద్ బుధవారం వ్యవసాయ పనుల నిమిత్తం ఎడ్ల బండి కట్టుకొని దాని వెనుక ఆవును కట్టుకొని పొలానికెళ్లాడు. సాయంత్రం కురిసిన భారీ వర్షానికి భూదేవి వాగు పొంగుతుండగా ఎడ్ల బండితో దాటే ప్రయత్నం చేశాడు. దీంతో నీటి ప్రవాహానికి ఎద్దులు, ఆవు కొట్టుకుపోయాయి. రైతు అరవింద్ ప్రాణాలతో బయటపడ్డాడు. గురువారం ఉదయం గ్రామస్తులతో కలిసి వాగు సమీపంలో వెతుకగా మృతి చెంది చెట్ల పొదల్లో చిక్కుకున్నాయి. వీటి విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



సోయా కొనుగోళ్లకు వేళాయె..!

- వచ్చే నెల మొదటి వారం నుంచి ప్రారంభం
- జిల్లాలో 10మార్కెట్లను సిద్ధం చేసిన అధికారులు
- ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్ కొనుగోళ్లు

జిల్లాలో పంట కొనుగోళ్ల పర్వం ప్రారంభం కానుంది. ఖరీఫ్ సీజన్‌లో పండించిన పంటలు ఇంటికొచ్చే వేళైంది. ఇప్పటికే సోయా పంట కోతలకు సిద్ధం కాగా.. పత్తి పంట సైతం అతి త్వరలోనే చేతికి రానుంది. తాజాగా సోయా కొనుగోళ్లను ప్రారంభించేందుకు అధికారులు సంసిద్ధమవుతున్నారు. అక్టోబర్ మొదటి వారం నుంచి జిల్లాలో సోయా కొనుగోళ్లను ప్రారంభించనున్నారు. ఇందుకు ఆయా ప్రాంతాల్లోని మార్కెట్లను సిద్ధం చేస్తున్నారు. ఇది వరకే ప్రారంభించాలని భావించినా పూర్తిస్థాయిలో కోతలు పూర్తికాకపోవడం.. అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణశాఖ హెచ్చరికల కారణంగా అధికారులు వాయిదా వేశారు. మరో వారం రోజుల్లో ప్రారంభమయ్యే ఈ క్రతువులో అన్నదాతలు సైతం మార్కెట్‌కు పంటను తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయం ఇది. అనేక ఒడిదొడుకులు, అధిక వర్షాలు, చీడపీడలను ఎదుర్కొని పండించిన రైతులకు ఫలితం వచ్చేది ఇప్పుడే. ఖరీఫ్ పంటలు చేతికొచ్చే సమయం కావడంతో ఇటు అధికార యంత్రాంగం సైతం ఇందుకనుగుణమైన చర్యలు ప్రారంభించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పత్తి, సోయా పంటలను కొనుగోళ్లు చేసేందుకు మార్కెట్లను సిద్ధం చేస్తోంది. ఇన్నాండ్లు పంటలు రాక బోసిపోయిన మార్కెట్లు త్వరలోనే రైతుల రాకతో మళ్లీ కళకళలాడనున్నాయి. తాజాగా సోయా పంట కోతలు కొనసాగుతుండటంతో పూర్తయిన వారు పంటను మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 1.10లక్షల ఎకరాల్లో సోయా పంట సాగు చేయగా.. సుమారు 4లక్షల క్వింటాల్‌ల వరకు పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయా పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సైతం రంగం చేస్తోంది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4892 ఉండగా.. ప్రయివేటు విపణిలో క్వింటాల్‌కు రూ.4679 వరకు పలుకుతోందని తెలుస్తోంది. ఈ రెండు ధరలు దాదాపు దగ్గరగా ఉండటంతో ప్రయివేటులోనూ జోరుగా అమ్మకాలు జరగనున్నట్లు తెలుస్తోంది.

పది మార్కెట్లలో ప్రారంభం..!

ఆదిలాబాద్ జిల్లాలో పది మార్కెట్లలో సోయా కొనుగోళ్లను చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఆదిలాబాద్, ఇచ్చోడ, బేల, జైనథ్, బోథ్, తాంసి, ఇంద్రవెల్లి, నార్నూర్, సిరికొండ మార్కెట్లలో అధికారికంగా ప్రారంభం కాగా.. కొత్తగా నేరడిగొండలోనూ చేపట్టాలని అధికారులు ప్రతిపాదించారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఇక్కడ కూడా ప్రారంభం కానుంది. వీటిలో కొనుగోళ్లకు అవసరమైన ప్రక్రియను సిద్ధం చేసేందుకు అధికార యంత్రాంగం సంసిద్ధమవుతోంది. మరోపక్క మార్కెట్లతో పాటు ప్రయివేటు వ్యాపారులు సైతం పంటను కొనుగోలు చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రయివేటులో క్వింటాల్‌కు రూ.4670 వరకు చెల్లించేందుకు ముందుకు రావడంతో రైతులు వారి వైపు సైతం మొగ్గుచూపనున్నట్లు తెలుస్తోంది. దళారులు పంట పొలాల దగ్గరికే వెళ్లి కొనుగోలు చేస్తుండటంతో రైతులు విక్రయించేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. పంటను మార్కెట్‌కు తీసుకురావాలంటే రవాణా ఖర్చులు అదనం కావడంతో వీటిని తగ్గించుకునేందుకు రైతులు సైతం ప్రయివేటులో విక్రయించేందుకు సైతం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

వచ్చే నెలలో కొనుగోళ్లు ప్రారంభిస్తాం : ప్రవీణ్‌కుమార్, మార్క్‌ఫెడ్ డీఎం

జిల్లాలో సోయా పంట కోతలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇది వరకే కొనుగోళ్లు ప్రారంభించాలని భావించినా..ఇంకా పంట చేతికి రాకపోవడం, వర్షాల కారణంగా వాయిదా వేయాల్సి వచ్చింది. అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకు జిల్లాలోని మార్కెట్లను సిద్ధం చేస్తున్నాం.

మహిళల అభ్యున్నతి కోసమే మహిళా కమిషన్

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేసిందని కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, మహిళా కమిషన్ మెంబర్ ఈశ్వరీబాయి, అదనపు ఎస్పీ సురేందర్‌తో కలిసి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన పోషణ అభియాన్ పోషణ మాసం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. చట్టాల అమలుపై అధికారులకు అవగాహన ఉంటేనే ఇతరులకు చెప్పగలుగుతామని పేర్కొన్నారు. ఇప్పుడున్న మహిళా కమిషన్ ఒక విజన్, ఎజెండాతో ముందుకు వెళుతుందని, ఆదిలాబాద్ లాంటి మారుమూల ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా చేపడుతున్న సంక్షేమ పథకాలు అందరికీ చేరువయ్యేలా ఆయా శాఖల సమన్వయంతో పనిచేయాలని, అవసరమైతే పోలీస్, లీగల్ సపోర్ట్ తీసుకోవాలని అన్నారు. మారుమూల గ్రామాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ, రెవెన్యు శాఖల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి విషయంపై క్షుణ్ణంగా తెలిసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు జిల్లాల డీడబ్ల్యుఓలు, సీడీపీఓలు, వైద్య, మెప్మా తదితర శాఖల వారీగా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల తీరును చైర్‌పర్సన్‌కు తెలియజేశారు.

మహిళలు సంఘటితంగా ఉద్యమించాలి



నవతెలంగాణ-నిర్మల్

మహిళా వ్యతిరేక విధానాలపై మహిళలు సంఘటితంగా ఉద్యమించాలని ఐద్వా(అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమావేవంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు పలు తీర్మాణాలు రూపొందించారు. ప్రభుత్వాలు అవలంబించే మహిళా వ్యతిరేక విధానాలపై పోరాటాలను ముమ్మరం చేయాలని నిర్ణయించారు. అనంతరం ఐద్వా నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులురాలిగా బల్గూరి.రజిత, జిల్లా ఉపాధ్యక్షులుగా సుజాత, రమా, శైలజ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.ప్రసాద, సహాయ కార్యదర్శిగా గంగామణి, వనితను ఎన్నుకున్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి చర్యలు : ఫైజాన్ అహ్మద్



నవతెలంగాణ-నిర్మల్

వయోవృద్ధుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. గురువారం వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని (డావ్) వృద్ధాశ్రమాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి, వారి ఆరోగ్య సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. వయోవృద్ధుల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం ఇతర అంశాలపై పలు సూచనలు చేశారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా బహుమతులను అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ సిబ్బంది అజస్ అహ్మద్, విజయగౌరి, మూర్తి, మురళి, మధుసూధన్, రాము పాల్గొన్నారు.

పాముకాటుతో ఎద్దు మృతి

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని కొలమా గ్రామానికి చెందిన మందాడి చిత్రుకు చెందిన ఎద్దు పాముకాటుతో మృతి చెందింది. గురువారం ఉదయం ఎద్దులను మేపి పొలంలో ఓ చెట్టు కింద కట్టేసి భోజనం చేయడానికి ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం వెళ్లి చూసేసరికి ఓ ఎద్దు చనిపోయి ఉండడంతో రైతు ఆందోళన చెందాడు. ఎద్దు విలువ రూ.50వేల వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్



నవతెలంగాణ-నస్పూర్

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. గురువారం శ్రీరాంపూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా నాయకుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రయివేట్ పరిశ్రమలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్ పర్మినెంట్, నాన్ టీచింగ్, మున్సిపల్, గ్రామ పంచాయతీ తదితర రంగాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కనీస వేతన చట్టం, కార్మిక చట్టాలు అమలు చేయాలని, 1979 వలస కార్మిక చట్టం పటిష్ఠంగా అమలుపర్చాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక, పారిశ్రామిక విధానాల వల్ల అన్ని రంగాలలో తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక 29 చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని, కనీస వేతనానికి గ్యారంటీ లేకుండా చేసిందని తెలిపారు. 8గంటల పనిదినానికి బదులు 12గంటల పనిదినం ప్రవేశపెట్టిందన్నారు. దీంతో యజమానులు కోట్ల రూపాయలు లాభాలు గడిస్తున్నారన్నారు. ఈ వెట్టి చాకిరీ విధానాల రద్దు కోసం పోరాడాలన్నారు. ప్రభుత్వాల విధానాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో కార్మికుల పొందికలో చాలా మార్పులు వచ్చాయని, పర్మినెంట్ వర్కర్స్ సంఖ్య పడిపోయి నాన్ పర్మినెంట్ ఎంప్లాయిస్ సంఖ్య 95శాతం పెరిగిందన్నారు. ఇందులో మహిళా వర్కర్స్ సంఖ్య కూడా 25శాతం ఉందని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థలో వీరి పాత్రనే కీలకమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇస్తున్నాయన్నారు. కానీ కార్మికులకు కనీస వేతనాలు పెంచడం లేదని, 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం అమలు చేయాలని, కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో సెప్టెంబర్ 28న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర నాయకులు పాలడుగు సుధాకర్, జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి రాజేశ్వరి, గోమాస ప్రకాష్, జిల్లా సహాయక కార్యదర్శులు దాగం రాజారాం, దూలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీ ప్రాంతంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జైనూర్‌లో జరిగిన ఘటనపై రెండు రోజుల పాటు రాయిసెంటర్ సార్మెడిలు, రాజ్‌గోండు సేవా సమితి, అన్ని ఆదివాసీ సంఘాలు, మైనారిటీ మత పెద్దలతో చర్చించిన విషయాలపై సిఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ షబ్బీర్ అలీకి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో కలిసి పూర్తి నివేదికను అందించామని పేర్కొన్నారు. త్వరలో గవర్నర్ ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డితో రాయిసెంటర్, రాజ్ గోండు సేవా సమితితో పాటు అన్ని ఆదివాసీ సంఘాలను కల్పిస్తామన్నారు. జైనూరు బాధితురాలికి న్యాయం చేస్తామన్నారు. ప్రతి రోజు ఆమె ఆరోగ్య పరిస్థితులను మంత్రి సీతక్క డాక్టర్లతో మాట్లాడి తెలుసుకుంటున్నారన్నారు. ఇరు గ్రూపుల వారు సంయమనం పాటించాలని కోరారు. ఆదివాసుల ఉద్యమాలు అర్థవంతమైనవిగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. నాన్ ట్రైబల్స్ 5వ షెడ్యూల్‌లోని చట్టాలను గౌరవించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాలను భంగం కలగకుండా ఉండాలని సూచించారు.

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి

అధికారులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పేర్కొన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ట్రైబల్ వెల్ఫేర్, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై, పెండింగ్‌లో ఉన్న బిల్లుల వివరాలను అడిగి తెలుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇప్పించేలా సీఎం రేవంత్‌రెడ్డితో తాను మాట్లాడతానని పేర్కొన్నారు.

ప్రతిక్షణం అప్రమత్తతో విధులు నిర్వర్తించాలి

- నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ గౌస్ ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు త్వరితగతిన స్పందించాలని, ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. గురువారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తినా త్వరితగతిన సంఘటన స్థలాలకు చేరుకునేలా పూర్తి సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. గ్రామాలను సందర్శిస్తూ, మెడికల్, హెల్త్ క్యాంపులు నిర్వహిస్తూ యువతకు స్పోర్ట్స్ కిట్లను అందజేస్తూ, స్పోర్ట్స్ టోర్నమెంట్లను నిర్వహిస్తూ యువతతో, ప్రజలతో ఉన్న సత్సంబంధాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రతి ఎస్సై, పోలీసు ఉన్నత అధికారి వాహనంలో అత్యవసర సమయాలలో ఉపయోగపడే హెల్మెట్, డాల్, లాఠీ, బాడీ ప్రొటెక్టర్ లాంటి రైట్ గేర్ ఎక్విప్మెంట్స్ వెంట ఎల్లప్పుడూ ఉంచుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌ల వారీగా సిబ్బంది అందరికీ ప్రతివారం పోలీసు కవాతు, లాఠీ ఉపయోగంపై, అత్యవసర సమయంలో స్పందించే విషయాలపై శిక్షణను అందించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్ కేసులు వాటి ప్రస్తుత స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకుని విచారించారు. ముఖ్యంగా గంజాయి కేసులు, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్లు, ఎస్సీ ఎస్టీ కేసులు, ఫోక్సో కేసులు, దొంగతనాలు, మహిళలపై జరిగే నేరాలు, ఎన్‌బిడబ్ల్యూ వారెంట్లపై, అధికారుల వద్ద ఉన్న ఎంక్వయిరీ రిపోర్ట్‌ల వివరణపై చర్చించారు. జిల్లాకు వచ్చిన నూతన 10 మంది ఎస్ఐలకు పోలీస్‌స్టేషన్లు కేటాయించారు. విధులపై అవగాహన కల్పించాలని సంబంధిత ఎస్సైలకు సూచించారు. త్వరలోనే ప్రతిఒక్క పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, సిహెచ్ నాగేందర్, బి సురేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఎయిర్ ఫోర్స్ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లా కేంద్రంలో ఎయిర్ ఫోర్స్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రక్షణ శాఖకు చెందిన 369 ఎకరాల భూమి ఉందని, దానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగం మరో 1592 భూమిని గుర్తించిందన్నారు. గత ప్రభుత్వం భూమి సేకరించి ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేయలేదన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం కేంద్రం కోరిన విధంగా సహకరించడానికి సిద్ధంగా ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. మూతపడిన సిసిఐని తెరిపించాలని ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రి కుమారస్వామిని సైతం కలిసి వినతిపత్రం అందజేశారు. సిమెంట్ పరిశ్రమను తెరిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సముఖంగా ఉందని తెలిపారు.



ఎస్పీ మేడం.. ట్రిపుల్ ఐటీపై దృష్టి సారించండి

నవతెలంగాణ-ముధోల్

బాసర ట్రిపుల్ ఐటీలో నిరంతరం భద్రత వైఫల్యాలతో ఏదో ఒక ఘటన చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడిందని పలువురు విద్యావంతులు, విద్యార్థి సంఘాల నాయకులు గుర్తు చేస్తున్నారు. తాజాగా మంగళవారం రాత్రి ట్రిపుల్ ఐటీ నుండి భద్రత వైఫల్యంతో ఇద్దరు విద్యార్థులు గోడ దూకి పారిపోయారు. గతంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి పలువురు విద్యార్థులు పట్టుబడిన విషయం తెలిసిందే. ట్రిపుల్ ఐటీ భద్రతపై ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ప్రత్యేకంగా దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. గతంలో ట్రిపుల్ ఐటీ భద్రత పర్యవేక్షణకు మొదట సిఐని అప్పటి ప్రభుత్వం నియమించింది. దీంతో సమస్య మొదటికి రావటంతో మళ్లీ ప్రభుత్వం ప్రత్యేక డిఎస్పిని నియమించింది. ఇటీవల డిఎస్పీ పోస్టును కుదించి కేవలం సిఐని మాత్రమే పోలీస్ శాఖ నియమించింది. ట్రిపుల్ ఐటీకి ప్రత్యేకంగా సెక్యూరిటీ గార్డులు ఉన్నప్పటికీ వీరిని పర్యవేక్షించడం పోలీస్ శాఖ పరిధిలోకి తెచ్చారు. అయితే కేవలం సీఐ మాత్రమే పర్యవేక్షించడం అన్ని సందర్భాల్లో సాధ్యం కాకపోవటంతో ఆయా ఘటనలకు కారణంగా తెలుస్తోంది. అంతేకాకుండా సిఐకి ప్రత్యేక సిబ్బందిని నియమించలేదు. ట్రిపుల్ ఐటీలో సెక్యూరిటీ గార్డులు తక్కువ సంఖ్యలో ఉండడంతో భద్రతా లోపాలు కొనసాగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. భద్రత విషయంలో సెక్యూరిటీ గార్డులు ఆయా సందర్భాల్లో విద్యార్థులను మందలించినప్పటికీ విద్యార్థులే సెక్యూరిటీ గార్డులను బెదిరించిన ఉదంతాలు కూడా లేకపోలేదు. భద్రతను కఠినతరం చేయాలంటే పోలీస్ శాఖ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించాల్సిన అవసరముందని విద్యావంతులు, విద్యార్థి సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ దిశగా ఎస్పీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | సెప్టెంబర్ 27, 2024 | www.navatelangana.com

విద్యార్థులు కష్టపడి చదివి జ్ఞానాన్ని సంపాదించాలి

నవతెలంగాణ-తలమడుగు



విద్యార్థులు కష్టపడి చదివి జ్ఞానాన్ని సంపాదించాలని మోటివేషనల్ స్పీకర్ సుందిళ్ల రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు జీవితంలో రాణించాలంటే జ్ఞానాన్ని సాధించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావు, ఉపాధ్యాయులు చంద్రమ్మ, వెంకటేశ్వర్, వినోద్‌రెడ్డి, మురళీధర్, రాకేష్, రవీంద్ర కుమార్, రాజేందర్, శంకర్, శ్రీనివాస్, సంతోష్, నర్సయ్య సుమలత, స్వప్న పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-ముధోల్



కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని, కాంగ్రెస్ మండల నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, పతంగీ కిషన్ అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్‌లో ఉన్న కళాశాలలను వెంటనే ప్రారంభించాలని ఆదేశించడంతో ముధోల్ డిగ్రీ కళాశాల ప్రారంభం కావటం సంతోషకరమని అన్నారు. కళాశాల ప్రారంభానికి కృషి చేసిన జిల్లా మంత్రి సీతక్క, మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావుపటేల్, విఠల్‌రెడ్డి, ముధోల్ మాజీ సర్పంచ్ వెంకటాపూర్ రాజేంధర్, వీడీసీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజీజ్, నగేష్, గోవింద్ పటేల్, నజీమ్, హన్మండ్లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ నుంచి పారిపోయిన విద్యార్థులు

- బయటపడ్డ భద్రత వైఫల్యం

నవతెలంగాణ-ముధోల్

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ జ్ఞాన సరస్వతి పుణ్యక్షేత్రంలో ఉన్న ట్రిపుల్ ఐటీ నుంచి ఇద్దరు విద్యార్థులు గోడ దూకి పారిపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో భద్రత వైఫల్యం మరోసారి బయటపడింది. నిత్యం బాసర ట్రిపుల్ ఐటీలో ఏదో ఒక సమస్యపై వార్తల్లో నిలుస్తున్నప్పటికీ ట్రిపుల్ ఐటీ వారు పట్టించుకోకపోవడంతో ట్రిపుల్ ఐటీ పరువు మంట కలుపుతున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యనభ్యసిస్తున్న ఇద్దరు ఇంజనీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థులు గోడ దూకి మంగళవారం అర్ధరాత్రి పరారయ్యారు. అయితే రాత్రుల్లో పెట్రోలింగ్ చేస్తున్న బాసర పోలీసులకు విద్యార్థులు కనిపించటంతో విచారించి ఇద్దరు విద్యార్థులను వెంటనే ట్రిపుల్ ఐటీ భద్రతా సిబ్బందికి అప్పగించారు. అయితే విద్యార్థులు ఎందుకు పారిపోయారో అనేది సరైన కారణాలు తెలియటం లేదు. ట్రిపుల్ ఐటీలో నిరంతరం భద్రత ఉందని చెప్పే ట్రిపుల్ ఐటీ వీసీ ఈ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ట్రిపుల్ ఐటీ గురించి ఇన్‌చార్జీ వీసీ వెంకటరమణ పట్టించుకోకపోవడంతో తరచు ఏదో ఘటనలు బయటపడుతున్నాయని వారు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై గురువారం బాసర ఎస్సై గణేష్‌ను నవతెలంగాణ ఫోన్‌లో వివరణ కోరగా పెట్రోలింగ్ చేస్తున్నా మా పోలీస్ సిబ్బందికి ఇద్దరు విద్యార్థులు కనిపించిన మాట వాస్తవమేనన్నారు. ఇద్దరు విద్యార్థులను వెంటనే ట్రిపుల్ ఐటీ భద్రత సిబ్బందికి అప్పగించామన్నారు.

మున్సిపాలిటీ నిధులపై రాజకీయం

- పట్టణాభివృద్ధిపై చిత్తశుద్ధి లేని నాయకులు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



ఖానాపూర్ మున్సిపాలిటీకి మంజూరైన టీయూఎఫ్ఐడీసీ నిధుల పై రాజకీయం సాగుతోంది. మున్సిపల్ చైర్మెన్, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య మొదలైన రగడ పార్టీల నాయకుల పరస్పర ఆరోపణల దాకా వెళ్లడం విమర్శలకు తావిస్తోంది. కేవలం 12 మంది కౌన్సిల్ సభ్యులతో ఉన్న ఖానాపూర్ మున్సిపాలిటీలో పాలకవర్గం సఖ్యతగా లేకపోవడం పట్టణాభివృద్ధికి ఆటంకంగా మారుతోంది. పార్టీల పరంగా వైరుధ్యాలున్నా అభివృద్ధి పనుల విషయంలో మాత్రం పాలక సభ్యులంతా ఏకతాటిపై ఉండాల్సి ఉంటుంది. ఖానాపూర్ మున్సిపాలిటీకి రూ.4.8కోట్లు టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరయ్యాయి. వీటిని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం కేటాయించారు. 8 వార్డుల్లో ఒక్కో వార్డుకు రూ.40 లక్షల చొప్పున కేటాయించారు. చైర్మెన్ వార్డులో 1.19 కోట్లు కేటాయించుకోగా, 2, 8 వార్డులకు రూ.10 లక్షల చొప్పున కేటాయించారు. సదరు 2, 8 వార్డుల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ కౌన్సిలర్లు కారింగుల సంకీర్తన, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ అబ్దుల్ ఖలీల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాము ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లుగా ఉన్నందుకే తమ వార్డులకు నిధులు తక్కువగా కేటాయించారని, వారు ఆరోపిస్తున్నారు. ఈ ఇద్దరు కౌన్సిలర్లు చైర్మెన్, కమీషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు నేపథ్యంలో కాంగ్రెస్ పట్టణ నాయకులు జోక్యం చేసుకొని ప్రతిపక్ష కౌన్సిలర్లు చేసిన తప్పిదం వల్లనే సదరు వార్డులకు నిధులను తక్కువగా కేటాయించినట్లు పత్రికా ముఖంగా ఆరోపించారు. మున్సిపాలిటీకి సంబంధించిన నిధుల విషయంలో పార్టీ నాయకుడు స్పందించడం రాజకీయ దుమారంగా మారింది.

కౌన్సిలర్ల తీరుపై విమర్శలు...

పట్టణాభివృద్ధికి కేటాయించిన నిధుల మంజూరు విషయంలో ప్రతిపక్ష కౌన్సిలర్లు అనుసరిస్తున్న తీరు విమర్శలకు దారి తీసింది. ఈ అంశాన్ని కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తకుండా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడాన్ని పలువురు తీవ్రంగా తప్పుబడుతున్నారు. మున్సిపల్ చైర్మెన్ ఉద్యేశపూర్వకంగా వివక్ష చూపితే కౌన్సిల్ సమావేశంలో నిలదీసి ప్రజలకు వివరించి ఉంటే హర్షించేవారు. అలా చేయకుండా అనవసరంగా ఫిర్యాదు చేయడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. మున్సిపల్ చైర్మెన్ సైతం పట్టణాభివృద్ధికోసం పాలక సభ్యులందరినీ కలుపుకొని ముందుకు పోతేనే మంచిదని పట్టణ ప్రజలు అంటున్నారు.

ప్రాధాన్యతను బట్టి కేటాయించాం

మనోహర్, కమిషనర్

వార్డుల్లో ఉన్న సమస్య తీవ్రత, ఎక్కడ పనులు ముందుగా చేయాలి, ఎక్కడ తర్వాత చేయాలి, అనే ప్రాధాన్యతను బట్టి నిధులు కేటాయించాం. కౌన్సిల్ సమావేశంలో సభ్యుల తీర్మాణం మేరకే వార్డులకు నిధులు కేటాయించాం. రాజకీయ ఆరోపణలతో సంబంధం లేదు.

డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటవుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ గురువారం పరిశీలించారు. భవనాన్ని పూర్తిగా కళాశాలకు అప్పగించక పోవటంతో స్థానిక బీజేపీ నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే భవనాన్ని పరిశీలించి, పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత భవనం గిరిజన గురుకుల పాఠశాలకు చెందింది కావటంతో ఈ విషయాన్ని ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లి భవనం పూర్తిగా డిగ్రీ కళాశాల అప్పగించే విధంగా వెంటనే చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు రోళ్ల రమేష్, గౌరవాధ్యక్షుడు ధర్మపురి సుదర్శన్, వీడీసీ అధ్యక్షుడు నారాయణ, నాయకులు సాంఫ్లీ రమేష్, నర్సాగౌడ్, తాటివార్ రమేష్, దేవోజీ భూమేష్, సతీష్‌రెడ్డి, జీవన్, మోహన్ యాదవ్, సాయినాథ్, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

నిషాన్‌ఘాట్ ప్రజలకు సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆందోళన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అర్లి(బి) గ్రామపంచాయతీ పరిధిలోని నిషాన్‌ఘాట్‌లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న వారికి సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పేదలతో కలిసి కలెక్టర్ కార్యాలయ ముట్టడి చేపట్టారు. పోలీసులు ముందస్తుగా అక్కడ బందోబస్తు చేపట్టారు. అధికారులు స్పందించి పట్టాలతో పాటు కరెంట్ సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏండ్ల నుంచి నిషాన్ ఘాట్‌లో గుడిసెలు వేసుకొని పేద ప్రజలు నివాసం ఉంటున్నారన్నారు. అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేవన్నారు. కరెంట్ లేక రాత్రి సమయంలో విష కీటకాల మధ్య జీవనం సాగిస్తున్నారనన్నారు. కరెంట్ కావాలంటే అడ్రస్ కావాలని, అధికారులు స్పందించి, పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూడా పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు సుముకంగా ఉందని, అధికారులు నిషాన్‌ఘాట్ ప్రజలకు పట్టాలిచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళినిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అరుణ్ కుమార్, కుంటాల రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ పాషా, అర్ధాంగి రమేష్, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమీనా బేగం, కృష్ణవేణి, సంగీత, రేఖ, పుష్ప, కండెల గణేష్ ఉన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



నవతెలంగాణ-నిర్మల్

నాణ్యమైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్ అన్నారు. గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జిల్లాలోని మహిళ ఆరోగ్య సహాయకులకు అమ్మకోసం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్ మాట్లాడారు. అమ్మకు అందించే సేవలను మంచి నాణ్యతతో అందించాలన్న ఉద్యేశంతో శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ముఖ్యంగా గర్భవతుల్లో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను వివరించారు. వాటిని నివారించడానికి, అదేవిధంగా మాతృ మరణాలను తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెరుగైన నాణ్యమైన సేవలు అందించడానికి అవసరమైన జ్ఞానాన్ని అందించడం వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ శిక్షణ ఇవ్వడానికి హైదరాబాద్ నుంచి వచ్చిన కన్సల్టెంట్స్ డాక్టర్ సంతోషిణి, డాక్టర్ అఖిల జిల్లాలో టీఓటీ డాక్టర్స్ శ్యాంకుమార్, డాక్టర్ అరుణ్ శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో మెటర్నటీ హెల్త్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, డీపీహెచ్ఎన్ఓ సాయమ్మ జిల్లాలోని మహిళా ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలాభివృద్ధిని విస్మరించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

గిరిజన గ్రామాలాభివృద్ధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు అన్నారు. గురువారం మండలంలోని రాములుగూడ గ్రామంలో సీపీఐ(ఎం) గ్రామశాఖ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అటవీ ప్రాంతాన్ని పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు నూతన అటవీ చట్టాన్ని తెచ్చి ఆదివాసులను అడవి నుంచి దూరం చేసేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. షెడ్యూల్ ప్రాంత హక్కులకై, గిరిజన చట్టాల అమలుకై సీపీఐ(ఎం) పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్త శుద్ధితో కృషి చేయాలనీ డిమాండ్ చేశారు. కనీస వసతులు విద్యావైద్యం, తాగునీరు, రోడ్లు సదుపాయలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్, మండల కార్యదర్శి స్వామి, గ్రామ నాయకులు దండంజ కిష్టు, సురేష్, శ్రీను, సుశీల పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ఎన్ఎస్‌యూఐ నాయకులు

నవతెలంగాణ-ముధోల్

హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్‌ను ఆయన నివాసంలో గురువారం ముధోల్ మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు శశికూమార్ ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం బాసర ట్రిపుల్ ఐటీ సమస్యలను విన్నవించారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించి తొందర్లోనే మంత్రి సీతక్కతో కలిసి ట్రిపుల్ ఐటీని సందర్శిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు విష్ణు, గంగాప్రసాద్, జైవర్ధ్ పాల్గొన్నారు.

ఎంఈఓలుగా బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-పెంబి

మండల నూతన విద్యాశాఖాధికారిగా రాంచందర్‌ను నియమిస్తూ డీఈఓ రవీందర్‌రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్ని సంవత్సరాల నుంచి పెంబి ఎంఈఓ పోస్టు భర్తీ కాకపోవడంతో జిల్లాలోని సారంగాపూర్ మండల ఎంఈఓ మధుసూదన్ పెంబి ఇన్‌చార్జి ఎంఈఓగా విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. కాగా మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల పీజీహెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న రాంచందర్‌కు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన గురువారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. మండలంలోని ట్రాస్మా సంఘం అధ్యక్షులు పుప్పాల మల్లేష్, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఉద్యోగులు నూతన ఎంఈఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బేల : బేల మండల ఎంఈఓగా కోల నర్సిములు గురువారం ఎమ్మార్సీలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది అతుల్, సీఆర్పీ వెంకన్న ఉన్నారు.

కుభీర్ : మండల నూతన ఎంఈఓగా రాజుల విజయ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటానని అన్నారు. అనంతరం మండల సీఆర్పీలు ఎంఈఓను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో సీఆర్పీలు ఆనంద్, గణేష్, గంగాధర్, రవీందర్, రాజేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సిరికొండ : మండల ఎంఈఓగా సునీల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు మండలంలో విద్య వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, సంతోష్, సత్యనారాయణ, హిమ బిందు, ప్రతిమ, మాధవి, రజిత, సీతారాం పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆదిలాబాద్‌గా తీర్చిదిద్దాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి పదేండ్లు పూర్తయిన సందర్భంగా గురువారం స్వచ్ఛతా హి సేవాలో భాగంగా పోస్టాఫీస్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ దేవారెడ్డి సిద్దార్థ, కళాశాల అధ్యాకుడు శ్రీనివాస్ మాట్లాడారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించేలా పట్టణంలో ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సెప్టెంబర్ 17 నుంచి ప్రారంభమైన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఆదిలాబాద్ డివిజన్ లవకుశ్, హెడ్ పోస్టుమాస్టర్ గంగాధర్, ఐపీపీబీ మేనేజర్ రాజేష్ కుమార్, ఐపీ రాజు నాగిరెడ్డి, కళాశాల అధ్యాకులు శ్రీనివాస్ ఉన్నారు.

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్ : తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారద ఆదిలాబాద్ పర్యటనకు వచ్చారు. గురువారం పెన్‌గంగా భవన్‌లో ఆమెను కాంగ్రెస్ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందించి స్వాగతించి, శాలువాతో సత్కరించారు. జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజేందర్, కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, శ్రీలేఖ, సాయిమౌనరెడ్డి, లోక ప్రవీణ్‌రెడ్డి, షకీల్, గిమ్మ సంతోష్ ఉన్నారు.

చైర్‌పర్సన్‌ను కలిసిన బోరంచు శ్రీకాంత్‌రెడ్డి

తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి మహిళ కమిషన్ చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ మేరకు మహిళల హక్కులు, భద్రత, సంక్షేమం వంటి పలు ప్రధాన అంశాలపై చర్చించారు. భవిష్యత్తులో మహిళా సమస్యల పరిష్కారానికి మరింత సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో దేవిదాస్‌చారి, నవీన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, మావల మండల అధ్యక్షులు చంద్రశేఖర్, ఇమామ్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు వేముల, రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని పొచ్చర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఏకలవ్య ఫౌండేషన్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ విద్యవాహిని ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ ఇన్‌చార్జి హరీశ్ మాట్లాడుతూ విద్యార్థులకు సృజనాత్మకతను ప్రేరేపించడానికి ప్రతి నెల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపడానికి ప్రతిభ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, విద్యవాహిని ప్రాజెక్ట్‌కు సహకరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాలు లభించేలా వంటకాల ప్రదర్శన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోషణ మాసంలో భాగంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించేలా వంటకాల ప్రదర్శనను గురువారం పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఇందులో మహిళాలు ఉత్సహంగా పాల్గొని, వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వంటకాలు చేసిన మహిళాలను కిరీటంతో సత్కరించి, బహుమతులను అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని మహిళాలు, బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పోషణ మాసంలో భాగంగా పౌష్టికాహారంతో పాటు ఇతర వాటిపై అవగాహన కల్పిస్తున్నామని అంగన్‌వాడీ టీచర్ రాధ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీలోని మహిళలు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనంలో గురువారం మహా జన సభను డైరెక్టర్లతో సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరం పాటు పడి అభివృద్ధికి కృషి చేద్దామని అన్నారు. సంఘాలు అభివృద్ధి చెందాలంటే డైరెక్టర్లుతో పాటు ఉద్యోగస్తులు అందరం కూడా కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. మహా జనసభలో వైస్ చైర్మెన్ నల్ల పద్మాకర్‌రెడ్డి, సీఈఓ మోతి శ్రీనివాస్, డైరెక్టర్లు ప్రతాప్, లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గంగారాం, నారాయణ, సొసైటీ సిబ్బంది సాగర్, సత్యనారాయణ, భీంరావు, సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-నార్నూర్

గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులను నిర్వహించే కార్మికులకు గురువారం ఎంపీఓ స్వప్నశీలా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. ముందుగా ఆస్పత్రిలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులను చేపట్టారు. అనంతరం పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు పారిశుధ్య కార్మికులకు పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి మోతీరాం, కార్మికులు బాపూరావ్, కిషన్ ఉన్నారు.

అట్టహాసంగా ఫ్రెషర్స్ డే వేడుక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఉత్సహంగా జరిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులను స్వాగతం తెలిపేలా సీనియర్లు వేడుకను ఘనంగా నిర్వహించారు. గురువారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకలకు కళాశాల ప్రిన్సిపాల్ డా. సంగీత హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశలో డిగ్రీ ఎంతో కీలకమన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. క్రమశిక్షణతో చదివి జీవితంలో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆయా సినిమా పాటలపై నృత్యాలు ఆకట్టుకున్నాయి. మిగిత విద్యార్థులు వారి ప్రదర్శనలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తు కేరింతలు, ఈలలు కొడుతూ వారిని ఉత్సహపరిచారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది, అధ్యాపకులు సంతోష్ కుమార్, చక్రవర్తి, రమాకాంత్‌గౌడ్, శ్రావణి, మంజుల, రవికిరణ్, అష్రఫ్ అలీ, జ్ఞానేశ్వర్, రాజ్ కుమార్, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 27, 2024 | www.navatelangana.com

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. మండలంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై, సమస్యల పరిష్కారానికి ప్రతి ఒకరు సహకరించాలని ఆయన కోరారు. మండలం నుండి మహారాష్ట్ర రాజుర వరకు బస్ సౌకర్యం కల్పించాలని నాయకులు కోరగా వెంటనే ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్‌కు ఫోన్ చేసి బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. మండల కేంద్రం సహా గ్రామాల్లోని రోడ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే అన్నింటినీ పరిశీలించి నూతన రోడ్ల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మాజీ జడ్పీ చైర్మన్ సీడాం గణపతి, ఎల్ములే కిషోర్, సోహెల్, నర్గవార్ రాజు, అఖీల్, ఆఫ్సార్, తరుణ్ కిర్మారే, లోఖండే వసంత్, జల్ల అశోక్, దుర్గం తులసీరామ్, సలీం పాల్గొన్నారు.

ఎస్పీఎం కాలుష్యాన్ని నివారించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సిర్పూరు పేపర్ మిల్లు నుండి వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించాలని బీఆర్ఎస్ నాయకులు లెండుగురె శ్యాంరావు డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీఎం కాలుష్యం వల్ల పట్టణంలోని సర్దార్ బస్తీ, సంఘం బస్తీ, బాలభారతి ఏరియా, సుభాష్ కాలనీ, సర్‌సిల్క్ ప్రాంత వాసులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించని పక్షంలో ఎస్పీఎం యాజమాన్యంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మొయిన్, రాజ్‌కుమార్, సలీం, నక్క మనోహర్, శోభన్, కన్నయ్య రమాదేవి, అంజన్న, దాసరి నరేందర్ పాల్గొన్నారు.

మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన ధీరవనిత ఐలమ్మ

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే
- కలెక్టరేట్‌లో ఘనంగా ఐలమ్మ జయంతి



ఆసిఫాబాద్ : ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు, రజక సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పెత్తందార్ల దోపిడితనానికి అడ్డు నిలిచి తెలంగాణ తెగువతో మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన ధీర వనిత ఐలమ్మ అని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారి సజీవన్ అధ్యక్షతన నిర్వహించిన ఐలమ్మ జయంతి వేడుకలకు అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీఓ లోకేశ్వర్ రావ్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ తెగువను పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వనిత వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. అంత గొప్ప వనితకు తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత అధికారికంగా ఆమె జయంతి వేడుకలు నిర్వహించి ఘనమైన నివాళి అర్పిస్తున్నట్లు తెలిపారు. ఐలమ్మ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఆమె ఆశయ సాధనకు ముందుకు సాగాలన్నారు. రజక కూలీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. జిల్లాలో మహనీయుల విగ్రహాల ఏర్పాటు కోసం అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఫ్యాక్స్ అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, జిల్లా రజక సంఘం అధ్యక్షులు కడతల మల్లయ్య, బీసీ సంక్షేమ సంఘం నాయకులు రూప్నర్ రమేష్, వైరగడే మారుతి, నాయకులు వేములవాడ గణపతి, బూసి సంతోష్, కడతల సాయి, సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో

జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వీరనారి ఐలమ్మ జయంతి వేడుకల్లో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి మహిళలలో స్ఫూర్తి నింపిన వీర వనిత అని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక అన్నారు. కార్యక్రమంలో సీఐలు సతీష్, రాణాప్రతాప్, కేశవులు, ఆర్ఐలు పెద్దయ్య, అంజన్న, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : వీరనారి ఐలమ్మ జీవితం ఆదర్శనీయమని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని 14వ వార్డులో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుండి విముక్తి కోసం పోరాడిన వీర వనిత ఐలమ్మ అని అన్నారు. ఇలాంటి మహనీయుల చరిత్రను భావి తరాలకు అందించి సమిష్టిగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తిర్యాణి : మండలంలో వీరనారి ఐలమ్మ 129 జయంతి వేడుకలను మండల రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం మండల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం వీరనారి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చంద్రయ్య మాట్లాడుతూ చాకలి ఐలమ్మ చేసిన సేవలను కొనియాడారు. భూమి కోసం, బుక్తి కోసం వీరోచితంగా పోరాటం చేశారని, అగ్రవర్ణాల ఆదిపత్యం చేసి మహిళలందరిని చైతన్యం చేసిన గొప్ప వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సురేందర్‌కుమార్, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్‌కుమార్, తిరుపతి, సత్యం, శ్రీకాంత్, అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలో వీరనారి ఐలమ్మ జయంతి వేడుకలు రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పొన్న వెంకటేష్, శ్రీనివాస్, రాకేష్, రవి, నాయకులు జావిద్ అలీ, సామల తిరుపతి, కొంద్రా బ్రహ్మయ్య, శ్రీరామచంద్రశేఖర్, ఆయిల్ల శంకర్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. రజక సంఘం మండల అధ్యక్షులు గుండా హనుమంతు మాట్లాడుతూ భూపోరాటానికి నాంది పలికిన ఐలమ్మ బహుజన ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి ప్రతీక అని కొనియాడారు. ఐలమ్మ పోరాటలు, జీవిత చరిత్రను నేటి తరం వారికి తెలియజేసే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బండు, యూత్ కమిటీ మండల అధ్యక్షుడు ప్రశాంత్, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సిర్పూర్(టి)



తిర్యాణి



బెజ్జూర్



కాగజ్‌నగర్



వాంకిడి

నేటి విద్యార్థి మహా గర్జనను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

27న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న విద్యార్థి మహాగర్జనను జయప్రదం చేయాలని అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలె సాయికృష్ణ కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్లను గురువారం కాగజ్‌నగర్ బస్టాండ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌లు ఆరేండ్ల నుండి రావడం లేదని, దీనితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాలు అప్పులు తీసుకొచ్చి కళాశాలలు నడిపే పరిస్థితి ఉందన్నారు. మండల విద్యావ్యవస్థను పర్యవేక్షించాల్సిన ఎంఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంటనే ప్రతీ మండలానికి రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిరికొండ నితీష్, కార్తీక్, కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యదర్శి రక్షిత, కళాశాల కమిటీ ఉపాధ్యక్షులు చిత్తరంజన్, తేజస్విని, సహాయ కార్యదర్శులు పూజ, ఝాన్సీ, రాణి, అనూష పాల్గొన్నారు.

రౌట సంకేపెల్లిలో మెగా మెడికల్ క్యాంపు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నరేంద్ర మోడీ జన్మదిన వారోత్సవాలను పురస్కరించుకొని బీజేపీ నాయకులు, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో మండలంలోని రౌటసంకేపెల్లిలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి తుకారం భట్, డీఆర్డీఓ దత్తారం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ఆదివాసీ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. క్యాంపులో భాగంగా గ్రామంలోని ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంగ పెంటయ్య, బోర్‌గూడ మాజీ సర్పంచ్ సత్తన్న, పార్టీ సీనియర్ నాయకులు శ్రీకాంత్, కోట గొల్లయ్య, బిజూ, గట్టయ్య, పుల్లయ్య, ప్రసాద్ గౌడ్, లింగయ్య, కిష్టయ్య, సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దుర్గం లింగయ్య, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, ఆత్రం కొండు, శ్రీకాంత్, వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహనా సదస్సు



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని రైతువేదికలో గిరిజన ఉప ప్రణాళికపై కృషివిజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి శాస్త్రవేత్త స్రవంతి రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. సమీకృత పంట నిర్వహణ, మామిడి ఉద్యానవన పంటలలో అవగాహన కల్పించడంతో పాటు కూరగాయల పంటలను పండించే విధానం, మార్పులు చేపట్టాలని సూచించారు. మొత్తం ఒకేసారి వేయకుండా రెండు లేదా మూడు విడతలుగా వారం నుండి పది రోజుల అంతరంలో వేయాలన్నారు. కూరగాయల పంటలలో ముడత, కాయతొలుచు పురుగులు, ఇతర వ్యాధులకు సంబంధించిన నివారణ తెగలను రైతులకు సూచించారు. మందులు పిచికారి చేయాల్సిన సమయంలో మందు మార్చినప్పుడు శుభ్రంగా చేతులు కడగాలని, ఆ తర్వాత ఇతర మందులు వాడేటప్పుడు రెండు సార్లు లేదా మూడు సార్లు పిచికారి చేయాలన్నారు. ఒకే విధమైన పంటలు వేయకుండా పంటల మార్పిడి చేయాలని, దీని ద్వారా అధిక లాభం వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి గోపీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు రాజేశ్వర్, శంకర్, తాండవకృష్ణ, మానస, పరిమిళ, వెంకటేశ్, వివిధ గ్రామాలకు చెందిన రైతుమిత్ర సంఘాలు, రైతులు పాల్గొన్నారు.

విజయదశమి ఉత్సవాల ఏర్పాట్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 12న విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు. ఉత్సవాల ఏర్పాటల్లో భాగంగా గురువారం ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన ప్రచార సామాగ్రిని విడుదల చేశారు. విజయదశమి రోజున ఆలయ ప్రాంగణంలో ఎప్పటిలాగే వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ ప్రముఖులు తెలిపారు. శ్రీరాముని ఎంపిక, శమీవృక్ష పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు కార్యదర్శి గుండ వెంకన్న, కోశాధికారి పిన్న వివేక్, కమిటీ ప్రముఖులు వనం మధుకర్, కపాల్, నరసింహస్వామి, శ్రీనివాస్ ఆలయ అర్చకులు శిరీష్ శర్మ పాల్గొన్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

గిరిజన ప్రాంత చట్టాలు 1/70, పేసా చట్టంపై ప్రతి అధికారి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీఓ లోకేశ్వరరావులతో కలిసి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మండల ప్రత్యేక అధికారులు, ఏజెన్సీ గ్రామపంచాయతీల పంచాయితీ కార్యదర్శులకు 5వ షెడ్యూల్, గిరిజన ప్రాంత, ఏజెన్సీ చట్టాలు, దేశ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన చట్టాలపై గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రాజ్యాంగం ప్రకారం గిరిజన ప్రాంతాలలో ఉన్న భూ చట్టాలు, పేసా చట్టాలను అందరూ రక్షించాలని, చట్టాల ఉల్లంఘన జరగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. 5వ షెడ్యూల్ ప్రకారం గిరిజన ప్రాంతంలో రాజ్యాంగం గిరిజనులకు ఎన్నో చట్టాలు తీసుకురావడం జరిగిందని, గిరిజనుల సంక్షేమం, హక్కుల రక్షణ కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. గిరిజన చట్టాలలోని ప్రతి అంశంపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హైదరాబాద్ నుండి వచ్చిన ప్రత్యేక అధికారి ఎంఏ ఆదిల్ ఏజెన్సీ చట్టాలు, పేసా చట్టంలోని పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, ఉట్నూర్ ఎస్‌డీసీ గంగాధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తి వేయాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు సరిగ్గా రాకపోవడం, అరకొర వసతులతో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులతో పాటు ఎంపీడీఓను ఆ కారణంగా కలెక్టర్ సస్పెండ్ చేయడం సరికాదని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఉపాధ్యక్షులు తిరుపతి అన్నారు. కొన్ని రోజుల క్రితం నల్గొండ జిల్లా గుర్రంపాడు మండలం ఎంపీడీఓ మంజుల, పులిచెర్ల గ్రామం పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వాక్య తండా కార్యదర్శి స్వప్నను విధులలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆకారణంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం మండల కార్యదర్శులు నల్ల బ్యాడ్జి ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు సక్రమంగా రాకపోవడం వలన గ్రామాలలో ఎలా అభివృద్ధి పనులు జరుగుతాయని, ఇతర పనుల భారాన్ని మాపై మోపి ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాలలో అప్పులు చేసి సానిటేషన్, ఇతర పనులు చేస్తున్నమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఉన్నత అధికారులు సస్పెండ్ చేయడం ఎంతవరకు న్యాయమని, అధికారులు పునరాలోచించి సస్పెండ్ చేసిన ఎంపీడీఓ, కార్యదర్శులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి సందీప్, ఉపాధ్యక్షులు శరణ్య, నగేష్ రాహుల్, సుజాత, మౌనిక, తేజస్విని పాల్గొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చూస్తా



నవతెలంగాణ-కౌటాల

రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం మండలంలోని తలోడి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ బండపాటి శివారులోని రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. తలోడి, గురుడు పేట్, కనికి, కన్నెపెల్లి గ్రామాల రైతులు ఎన్నో ఏండ్ల నుండి సాగు చేసుకుంటున్నామని వాటికి ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవు అని ఎమ్మెల్సీ దండె విఠల్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి రైతులు ఎవరు అధైర్య పడవద్దని మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మీకు న్యాయం జరిగేలా చూస్తా అని రైతులకు హామీ ఇచ్చారు. రైతుల వివరాలు సేకరించి రైతులందరికీ హక్కు, సాగు పత్రాలు ఇచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. అనంతరం మండల కేంద్రంలోని పాగిడి లాహను బాయి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆ కుటుంబాని పరామార్శించి ఆర్థిక సాయం అందజేశారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎంఈఓల బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కెరమెరి

మండల విద్యాశాఖ అధికారిగా అడే ప్రకాష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత ప్రభుత్వం పాఠశాల పర్యవేక్షణ కోసం నోడల్ అధికారులను నియమించింది. ఇక్కడ పని చేసిన సిర్పూర్(యు) ఎంఈఓ కుడిమేత సుధాకర్ అదనపు బాధ్యతలు చేపట్టారు. కాగా ఆయన స్థానంలో మండలంలోని గోయగామ జిల్లా ఉన్నత పాఠశాల పీజీహెచ్ఎం అడె ప్రకాష్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా.. గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయనకు పుష్పగుచ్చం అందించి స్వాగతించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రెబ్బెన : మండలం విద్యాశాఖ అధికారిగా వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన వెంకటస్వామి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూటీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, మండల అధ్యక్షులు బత్తుల సదానందం, ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వినోద్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

టాస్క్ ద్వారా అక్టోబర్ 1న నిర్వహించే మినీ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని టాస్క్ రీజినల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ 1న జిల్లా కేంద్రంలోని టాస్క్ కార్యాలయం (పాత కలెక్టర్ భవనం)లో మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, ఈ జాబ్ మేళాను డిగ్రీ పూర్తి చేసి వయసు 30 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు టాస్క్ కార్యాలయం సంప్రదించవచ్చని సూచించారు.

ఐహెచ్ఎఫ్ఎంఎస్ టెండర్ల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఐహెచ్ఎఫ్ఎంఎస్ టెండర్లు కోరడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు బిడ్ డాక్యుమెంట్‌ను ఈనెల 27వ తేదీ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, అక్టోబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా ఈ-సేకరణ ప్లాట్ ఫామ్ టెండర్.తెలంగాణ.జీఓవీ.ఇన్ ద్వారా సమర్పించాలని, వివరాలకు వెబ్ సైట్‌లో సంప్రదించవచ్చని, ఏమైనా సందేహాలుంటే జీఎంసీ.కుమ్రంభీంఆసిఫాబాద్‌జీమెయిల్‌కు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోగా ఈ -మెయిల్ చేయవచ్చని తెలిపారు.

బెల్లంపల్లిలో లాన్ టెన్నిస్ పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

డబ్ల్యూపీఎస్, జీఏ 91వ వార్షిక క్రీడా పోటీలలో భాగంగా బెల్లంపల్లిలోని టీపీఓఏ క్లబ్‌లో లాన్ టెన్నిస్ డిపార్ట్‌మెంటల్ క్రీడా పోటీలు జరిగాయి. బెల్లంపల్లి ఏరియా హాస్పిటల్ మెడికల్ సూపరిండేంట్ ఏఎస్ఎస్ రాధాకృష్ణ ముఖ్య అతిదిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఉద్యోగ క్రీడాకారులు కోల్ ఇండియా స్థాయిలో రాణించాలన్నారు. గతంలో కోల్ ఇండియా స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్, జనరల్ క్యాప్టెన్ చంద్రకుమార్, ఏఐటీయూసీ నాయకుడు శ్రీధర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | సెప్టెంబర్ 27, 2024 | www.navatelangana.com

కొత్తపేట సీపీఐ(ఎం) గ్రామ కమిటీ కార్యదర్శిగా గుమ్ము

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కొత్తపేట గిరిజన గ్రామ కమిటీ సీపీఐ(ఎం) కార్యదర్శిగా మడావి గుమ్మును నియమించినట్లు పార్టీ మండల నాయకులు కొండ గొర్ల లింగన్న, అంబటి లక్ష్మణ్ తెలిపారు. గురువారం గ్రామంలో పార్టీ గ్రామ మహాసభలు నిర్వహించారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..?

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మున్సిపాలిటీ పరిధిలోని మిషన్ కాంపౌండ్ ఏరియాలో నిత్యం రద్దీగా ఉండే రోడ్‌లో వర్షాల కారణంగా రోడ్డు గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో వర్షపు నీరు నిలుస్తున్న కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందని జనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక మార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రోడ్‌పై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా..ప్రమాదాలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మహిళ నుంచి డబ్బులు లాక్కున్న వ్యక్తికి రిమాండ్

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు నుంచి రూ. 10 వేలను ఓ మహిళ మంగళవారం డ్రా చేసుకొని వెళుతుండగా వాటిని లాక్కొని పారిపోయిన వ్యక్తిని 24 గంటల్లో పట్టుకొని రిమాండ్‌కు తరలించామని ఎస్సై జి. రాజవర్ధన్ తెలిపారు. చింతలపల్లి గ్రామానికి చెందిన ముదేళ్ల భూమక్క బ్యాంక్ నుంచి డబ్బులు తీసుకొని బయట నిలబడి ఉండగా ఖమ్మం జిల్లా మధిర మండలానికి (ప్రస్తుత నివాసం నిర్మల్) చెందిన కంభంపాటి యేసోబ్ అలియాస్ అంగందుల సురేశ్ రెడ్డి అనే వ్యక్తి డబ్బులు లాక్కొని వెళ్లాడు. ఈ మేరకు గురువారం అతడిని పట్టుకొని దొంగిలించిన సొమ్ము రికవరీ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వ్యక్తిని పట్టుకున్న కానిస్టేబుళ్లు తుకారాం, భాస్కర్‌ను ఎస్సై, సీఐ అభినందించారు.

యువత భాగస్వాములు కావాలి



నతెలంగాణ-లక్షెట్టిపేట

2024 జాతీయ పొగాకు వ్యతిరేక ఉద్యమంలో యువత భాగస్వామ్యం కావాలని జిల్లా ఎన్‌సీడీ అధికారి లింగారెడ్డి అన్నారు. గురువారం పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలం చందారం, ఇటిక్యాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పొగాకు ఉత్పత్తులు(బీడీలు, సిగరెట్లు, గుట్కా) వాడటం వల్ల నోటి క్యాన్సర్, దుష్పరిణామాలను వివరించారు. పొగాకు ఉత్పత్తులకు బానిసలేతే వారికి కౌన్సెలింగ్, చికిత్స ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, హెచ్ఈఓ లక్ష్మణ్ స్వామి, ఎంఎల్‌హెచ్‌పీలు మౌనిక, సుమలత, హెల్త్ అసిస్టెంట్లు వేణు, ఇసాక్, ఏఎన్ఎంలు మంకుబాయి, యేసువర, విజయదర్శిని, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

కొత్తపేటలో న్యాయ అభియాన్



నవతెలంగాణ-జన్నారం

గిరిజన సంక్షేమ శాఖ మంచిర్యాల ఆధ్వర్యంలో కొత్తపేట గ్రామపంచాయతీలోని కొత్తగూడెం, కోలాంగూడ, రైకుంట గ్రామంలో ప్రధానమంత్రి జాతీయ ఆదివాసీ న్యాయమహా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్ర్యమంలో భాగంగా ఆధార్ కార్డు దరఖాస్తు, పీఎం జంధన్ అకౌంట్ తీయడం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు దరఖాస్తు, హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. పలు అంశాలపై అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్ర్యమంలో సహాయ గిరిజన సంక్షేమ అధికారి ఆకుల పురుషోత్తం, పంచాయతీ సెక్రటరీ అంజయ్య, బ్యాంక్ అధికారులు రవీందర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా మధుసూధన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ మధుసూధన్‌ను డీపీఓ వెంకటేశ్వర్ రావు, ఎంపీఓ సతీష్ రెడ్డి, మండల పరిషత్ సిబ్బంది శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, ఈజీఎస్ ఏపీఓ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సుల అందజేత



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 152 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులను అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ డీసీపీ చెప్యాల మలహర్రావు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చెప్యాలా రవీందర్‌రావు గురువారం అందజేశారు. విద్యార్థులకు అందజేసిన స్పోర్ట్స్ డ్రెస్‌ల విలువ రూ.75,500 వరకు ఉంటుందని తెలిపారు. ఇదే పాఠశాలలో చదువుకొని డీసీపీగా ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చిరు సాయం చేయడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాల, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించాలి

- రామగుండం సీపీ ఎం. శ్రీనివాస్
- పోలీస్‌స్టేషన్ రికార్డుల తనిఖీ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వహించాలని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన ఆయనకు పోలీసు గౌరవ వందనాన్ని సమర్పించారు. అనంతరం సీఐ కార్యాలయం, స్టేషన్ చుట్టూ పరిసరప్రాంతాల పరిశీలించారు.. 5 ఎస్ ఇంప్లిమెంటేషన్‌ని పరిశీలించి ఫైలు సక్రమమైన పద్ధతిలో ఉంచాలన్నారు. ఏ తరహా కేసులు ఎక్కువ నమోదవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. పలు కేసుల ఫైళ్లను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అంకిత భావంతో విధులు నిర్వహించే వారికి రివార్డులు, అవార్డులు ప్రతినెలా ఇవ్వడం జరుగుతుందన్నారు. వర్టికల్ వారిగా అధికారులు సిబ్బంది విధులు నిర్వహించాలని, ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని తక్షణ సేవలు అందించాలన్నారు. రౌడీలు, కేడీలు, సస్పెక్ట్, సంఘ విద్రోహ శక్తులపై నిరంతరం నిఘా ఉంచి, వారి కదలికలను గమనించాలన్నారు. చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి వారిని బైండోవర్ చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల రక్షణ గురించి ఎల్లవేళలా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, కేసులలో శిక్షణ శాతం పెంచాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే హెచ్ఆర్ఎంఎస్ (గ్రీవెన్స్ సెల్ ద్వారా పంపించాలని, మాడ్యూల్స్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో డీసీపీ, ఏసీపీ, పోలీసులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, సీఐ ఎ.నరేందర్, ఎస్ఐ సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు



నవతెలంగాణ-హాజీపూర్

గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న చలో హైదరాబాద్ మహాధర్నా విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు కోరారు. గురువారం మల్కల్లాలోని సోషల్ వెల్ఫేర్, గుడిపేటలోని ఎంజేపీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 010 పద్దు కింద, ప్రతి నెల ఒకటో తేదిన జీతాలు చెల్లించాలన్నారు. అశాస్త్రీయమైన కాలనిర్ణయ పట్టికను సవరించాలన్నారు. వార్డెన్, కేర్ టేకర్‌లను నియమించాలన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు సరిపడే వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మెస్ చార్జీలు పెంచాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పకూడదని, సొంత భవనాలు, ఉపాధ్యాయులకు క్వార్టర్స్ నిర్మించాలన్నారు. అన్ని గురుకులాలను కామన్ డైరెక్ట్ పరిధిలోకి తీసుకు రావాలన్నారు. పారిటీ స్కేల్స్ మంజూరు చేయాలన్నారు. ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్‌లకు గజిటెడ్ హోదా కల్పించాలన్నారు. పార్ట్ టైమ్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. ఈనెల 28న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజవంతం చేయాలనీ కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బి. కిరణ్, కార్యదర్శి బి. దేవదాస్ పాల్గొన్నారు.

నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కొత్త పరిపేట, పాత వరిపేట, లచ్చునాయక్ తండా గ్రామాలను కలుపుతూ నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు కోరారు. గురువారం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్‌ని కాగజ్‌నగర్‌లో కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుతం కోమటిచేను పంచాయతీలో ఉండగా మా గ్రామాలు పది కిలో మీటర్ల దూరంగా ఉందని, దీంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. మూడు గ్రామాలను కలిపి నూతన పంచాయతీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బానోత్ లక్ష్మణ్, బానోత్ సంతోశ్, భూక్య ఉమ్లానాయక్, జింజిరాల రాంచందర్, సాంబార్ రవి, జంజిరాల విష్ణుమూర్తి, గుండేటి నర్సయ్య, కడారి రాజు పాల్గొన్నారు.

రాజ్‌గోండ్ సేవా సమితి మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

రాజ్‌గోండ్ సేవాసమితి మండలం కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని జ్యోతి గార్డెన్‌లో గోండ్, పర్ధాన్ తోటి, కొలం నాయకపోడు, ఆంద్ కుల పెద్దలు సమక్షంలో సమావేశం నిర్వహించారు. అధ్యక్షులుగా ఆడ హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా మడావి బాదుషా, ప్రధాన కార్యదర్శిగా పెంద్రం బారీక్‌రావు, సంయుక్త కార్యదర్శి రాయ రాజేశ్వర్, కోశాధికారిగా ఆత్రం నరసింగ రావు, కార్యదర్శిగా మరుస కోలా వసంతరావు, సాంస్కృతిక కార్యదర్శులుగా వెంకటరమణ, ఆనందరావు, మడావి నాగార్జున, కార్యవర్గ సభ్యులుగా పరిచక సుధాకర్, మెస్రం మంగు పటేల్, శిడాం భీంరావు, కుర్సెంగ గంగారావు, తుమ్రం లక్ష్మణ్, పూసం సోనేరావు, కనక ధర్మారావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆయా కులాల పెద్దలు పెందూర్ ప్రభాకర్, పెందూర్ హనుమంత్, కొమురం శంకర్, నరేందర్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సీఎంపీఎఫ్ చిట్టీల అందజేత

నవతెలంగాణ-మందమర్రి

జనరల్ మేనేజర్ కార్యాలయ ఉద్యోగులకు జీఎం దేవేందర్ గురువారం సీఎంపీఎఫ్ చిట్టీలను అందజేశారు. ఏరియాలోని గనులు డిపార్ట్‌మెంట్లలో గురువారం నుండి సీఎంపీఎఫ్ చిట్టీలను అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ ఓ టు జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీవైపీఎం ఎండీ.ఆసిఫ్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లను గుర్తించండి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక రీచ్‌లను గుర్తించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో మైనింగ్, జిల్లా పంచాయతీ అధికారి, ఇతర అధికారులతో ఇసుక రీచ్ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ల నిర్వహణ వర్షాల కారణంగా నిలుపుదల చేయడం జరిగిందన్నారు. ప్రజల అవసరాల మేరకు ఇసుక సరఫరా చేసేందుకు జిల్లాలో నూతన ఇసుక రీచ్లను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ జగన్మోహన్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అలవెన్స్‌కోతపై నిరసన



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియా కాసిపేట 1వ గనిలో సింగరేణి యాజమాన్యం అవసరాల నిమిత్తం సర్ఫేస్‌లో పని చేసిన 473 మంది కార్మికులకు అండర్ గ్రౌండ్ అలవెన్స్ కోత విధించడాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం గని ఇన్‌చార్జి మేనేజర్ నిఖిల్ అయ్యర్‌కు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ గనిపై మాట్లాడారు. సింగరేణి సర్ఫేస్ లో పనిచేస్తున్న హాలర్ డ్రైవర్స్, ట్రామర్, ఇంజనీరింగ్, ఇతర పని స్థలాలలో పని చేస్తున్న కార్మికులకు అండర్ గ్రౌండ్ అలవెన్స్ కోత ఆపివేయాలన్నారు. ఈ విషయమై గ్రూప్ ఏజెంట్ రామ్ దాస్‌తో మాట్లాడడం జరిగిందని, సానుకూలంగా స్పందిస్తూ కార్మికులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు చిప్పరి శ్రీహరి, సహాయ కార్యదర్శి పార్వతి సురేష్, వర్క్ మెన్ ఇన్స్‌పెక్టర్ రంజిత్ కుమార్, ఏరియా ఇన్‌చార్జి లింగయ్య, కోల కమలాకర్, సంపత్, రఘురాం, బియ్యాల రాజన్న, ఆడెపు రవీందర్, పల్లెం శ్రీనివాస్, దామోదర్, శంకర్ పాల్గొన్నారు.

మృతి చెందిన డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జైపూర్

మండలం ఇందారం గ్రామానికి చెందిన డ్రైవర్ పాగాల తిరుపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా తోటి డ్రైవర్లు గురువారం ఆయన కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందించారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన తోటి డ్రైవర్ కుటుంబాన్ని నేరుగా కలిసిన మంచిర్యాల లారీ సెక్యూర్ డ్రైవర్స్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ. 40 వేల నగదుతో పాటు ఒక నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఛైర్మెన్ జక్కుల మహేష్ గౌడ్, ఉపాధ్యక్షులు ఠాగూర్ రఘుసింగ్, ట్రెజరర్ మహమ్మద్ ఆశ్రాఫ్ అలీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సయ్యద్ జుబేద్ అహ్మద్ పాల్గొన్నారు.



పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-వేమనపల్లి

గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈఓ గణపతి అన్నారు. గురువారం ఎంపీడీఓ దేవేందర్ రెడ్డితో కలిసి మండలంలోని నీల్వాయి, కల్లంపల్లి గ్రామ పంచాయతీలను సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య పనులు పరిశీలించి వర్షపు నీరు నిలవకుండా చూడాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పారిశుధ్య పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో హాజరయ్యారు. వారానికి రెండు సార్లు డ్రై డే చేపట్టి తడిపొడి చెత్తను వేరువేరుగా డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. పర్యటనలో భాగంగా కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రత పాటించాలని విద్యార్థినీలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని స్పెషల్ ఆఫీసర్ మయూరికి సూచించారు.

బోధన మెళకువలపై సమావేశం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇటిక్యాలలో గురువారం ఇంగ్లీష్ పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. దీనికి సెక్టోరల్ అధికారులు సత్యనారాయణ మూర్తి, యశోదర హాజరై ఆంగ్లంలో బోధన మెలకువలు, నాస్, లిప్‌ల గురించి ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వామనమూర్తి, ఉపాధ్యాయులు, ఆర్పీలు శ్రీనివాస్, సత్యం, సురేష్ పాల్గొన్నారు.

ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన



నవతెలంగాణ -వేమనపల్లి

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత సదస్సును గురువారం బ్యాంక్ మేనేజర్ శివశంకర్ ఆధ్వర్యంలో ముల్కల్ పేట గ్రామంలో నిర్వహించారు. బ్యాంకు పథకాలు, రుణాల గురించి కళాజాత బృందం పాటల ద్వారా, మ్యాజిక్ షో ద్వారా ప్రజలకు తెలియజేశారు. బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ అందరు డిజిటల్ లావాదేవీలు ఉపయోగించుకోవాలని, పంట రుణాలు సకాలంలో చెల్లించాలని, లేనిచో అధిక వడ్డీ కట్టాల్సి వస్తుందని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులకు రూపే కార్డు ద్వారా ప్రమాద భీమా రెండు లక్షలు, ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన పథకంలో 18-50 సంవత్సరాల వారికీ రూ.436 చెల్లిస్తే రూ.రెండు లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వార్షిక చందాలు చెలించి బీమా ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపారు. అటల్ పెన్షన్ యోజన పథకం, ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ నీటి సహాయకుల శిక్షణ



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన గ్రామ మంచి నీటి సహాయకుల శిక్షణ గురువారంతో ముగిసింది. ప్రతి గ్రామ పంచాయతీ నుండి ఒక ఎంపీడబ్ల్యూ వర్కర్‌కు శిక్షణ ఇచ్చారు. చివరి రోజు శిక్షణ కార్యక్రమానికి ఎస్ఈ కే.రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీలలో తాగు నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, డీవై ఈఈ ప్రవీణ్ కుమార్, మండల పంచాయితీ అధికారి షేక్ సఫ్దర్ అలీ, ఏఈ సాయి అచ్యుత్, ట్రైనర్లు, వివిధ గ్రామ పంచాయతీల ఎంపీడబ్ల్యూ వర్కర్లు పాల్గొన్నారు.

మండల విద్యాధికారులుగా బాధ్యతలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండల నూతన విద్యాశాఖ అధికారిగా హెలెన్ దారతి బాధ్యతలు స్వీకరించారు. గతంలో జడ్పీహెచ్ఎస్ వెంకటరావుపేట కాంప్లెక్స్ హెచ్ఎంగా పనిచేస్తున్న ఆమెకు ఎంఈఓగా బాధ్యతలు అప్పగించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓను పలువురు కలిసి పుష్ప గుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

దండేపల్లి : మండలం విద్యాధికారిగా దుర్గం చిన్నయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఎంఈఓ రవీందర్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో జన్నారం మండల విద్యాధికారి ఇన్‌చార్జి ఎంఈఓగా విజయకుమార్ గత రెండు రోజుల క్రితం బాధ్యతలు తీసుకున్నారు. మండలానికి రెగ్యులర్ ప్రతిపాదికన పోస్ట్ కేటాయించడంతో ఆయన స్థానంలో దుర్గం చిన్నయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు రావణవేణి రవి, మల్యాల మల్లేష్, నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 27, 2024 | www.navatelangana.com

గిరిజన బాలికల వసతిగృహం తనిఖీ

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని ఉమ్రి మారుమూల గిరిజన బాలికల వసతిగృహాన్ని తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్ గురువారం తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్య బోధన, మెనూ, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయ సిబ్బంది పని తీరుపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న కాస్మోటిక్స్, మందుల వివరాలు ప్రధానోపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరై విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు అందించాలని సిబ్బందికి సూచించారు. వంటలను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. 100 శాతం ఉత్తీర్ణత పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సంగీత

నవతెలంగాణ-బోథ్



మండలంలోని కుచులాపూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గా జి.సంగీత బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తాను 5వ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివిన స్కూల్‌కు ప్రిన్సిపాల్‌గా రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన గురువైన స్వర్ణలత అడుగుజాడల్లో నడుస్తూ రాష్ట్రంలోనే మంచి పాఠశాలగా ఉన్న దీనికి మరింత మంచి పేరు తీసుకొస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ కె. రవికుమార్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ లత, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, సూపరింటెండెంట్ అర్చన పాల్గొన్నారు.

ఐద్వా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐద్వా జిల్లా 4వ మహాసభలు విజయవంతమయ్యాయని జిల్లా నూతన కార్యదర్శి లంక జమున తెలిపారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా జమున, శకుంతల మరొకసారి ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా కె.లలిత, టి.ప్రభావతి, ఉపాధ్యక్షురాలుగా విజయ, కోశాధికారిగా ఆర్.మంజుల ఎన్నికయ్యారు. కమకిటీ సభ్యులుగా జి.పంచపూల, పల్లవి, రఫిక, రేణుక, ఇందుబాయి, పొచ్చక్కను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జమున మాట్లాడుతూ మహాసభల్లో 11మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఐద్వా పని చేస్తుందని తెలిపారు. మహిళల రక్షణ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

భగీరథ మెయిన్ పైప్ పగిలి రోడ్డుపై వరద



నవతెలంగాణ-తాంసి

పొన్నారి గ్రామంలో మిషన్ భగీరథ మెయిన్ పైప్ పగిలి రోడ్డుపై వరద పారింది. గురువారం ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పైప్ పగిలింది. దీంతో రోడ్డుపై వరదల ప్రవాహం పారింది. ఈ ప్రాంతంలో పార్కింగ్ చేసి ఉన్న రెండు ద్విచక్ర వాహనాల్లో ఒకటి దెబ్బతింది. ఆశన్నకు చెందిన షాప్‌లో రిఫ్రిజిరేటర్‌తో పాటు కొన్ని వస్తువులు పాడైపోయాయి. భగీరథ పైప్ లైన్ లీకేజీ కారణంగా నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం అందించాలని స్థానికులు కోరారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం



నవతెలంగాణ-బోథ్

మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జాదవ్ అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడిగా మిథున్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, కోశాధికారిగా జితేందర్, సలహాదారుడుగా అంజయ్య ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా చిప్ప శ్రీకాంత్, మడావి శ్రీకాంత్, ఎ శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గాన్ని ఎంపీడీవో జీవన్‌రెడ్డి సన్మానించారు.

ఎంఈఓలుగా బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-వాంకిడి

మండల విద్యాధికారిగా శివచరణ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంఈఓ మణుకుమార్ బదిలీపై వెళ్లగా మండలంలోని ఇందాని పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న శివచరణ్‌కుమార్ ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్నివేళలో అందుబాటులో ఉంటూ విద్యాభివృద్ధికి పాటుపడుతానని, సమస్యలను పరిష్కరించడానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

బెజ్జూర్ : మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా సునీత గురువారం స్వీకరించారు. బెజ్జూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పని చేస్తూ ఇన్‌చార్జి ఎంఈఓ అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో పనిచేసిన రమేష్ బాబు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జిని నియమించారు. నూతనంగా ఎంఈఓగా సునీతను ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-జన్నారం

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జన్నారం ఎంపీడీఓ శశికళ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ పరిసరాలలో శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. వర్షాలు అధికంగా కురుస్తున్న సందర్భంలో కాచి వడపోసిన మంచినీటినే తాగాలని సూచించారు.



రూ.12 లక్షలు వసూలు చేశారు


- ఇటికల్‌పహాడ్ రైతుల ఆవేదన
- న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు వేడుకోలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు (టి) మండలం ఇటికల్‌పహాడ్ రైతుల నుండి మధ్యవర్తులు రూ. 12 లక్షలు వసూలు చేశారు. బుధవారం నవతెలంగాణ దినపత్రికలో 'సందట్లో సడేమియాలు' శీర్షికన వార్తా కథనం ప్రచురితమైన విషయం తెల్సిందే. ఈ వార్తా కథనంపై స్పందించిన గ్రామస్థులు గురువారం ఏకంగా ప్రతీ కుటుంబానికి ఎంత మొత్తం ఇచ్చామనే పూర్తి వివరాలతో 'నవతెలంగాణ'ను సంప్రదించి వివరాలు వెల్లడించారు. ఈ వివరాలను పరిశీలిస్తే హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఖర్చుల పేరిట ప్రతీ ఇంటికి రూ. 2,500 చొప్పున 206 ఇళ్లకు రూ. 5 లక్షలకు పైగా వసూలు చేశారు. అదేవిధంగా పట్టాలిప్పిస్తామని చెప్పి 662 ఎకరాలకు, ప్రతీ ఎకరానికి రూ. 700 చొప్పున సుమారుగా రూ. 5 లక్షలు వసూలు చేశారు. ఈ లెక్కన మొత్తం రూ. 12 లక్షల వరకు డబ్బులు వసూలు చేశారు. పూర్తి వివరాలతో తాము సిర్పూరు (టి) పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. తాము 45 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీ అధికారులు ఒక పక్క లాక్కుంటుంటే, మరో పక్క మధ్యవర్తులు పట్టాలిప్పిస్తామని చెప్పి రూ. లక్షలు వసూలు చేశారని గ్రామస్థులు వాపోతున్నారు.

సబ్ కలెక్టర్‌కు మొర పెట్టుకున్న రైతులు

గురువారం ఇటికల్‌పహాడ్ గ్రామం నుండి పెద్ద సంఖ్యలో రైతులు కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చారు. సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తాము గతంలో 2,500 ఎకరాలను సాగు చేసుకుంటుంటే, ఆరేండ్ల క్రితం నుండి అటవీ అధికారులు లాక్కుంటూ వస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం కేవలం 400 ఎకరాలు మాత్రమే మిగిలి ఉందని, ఎప్పటికైనా అటవీ అధికారులు ఆ భూములను కూడా లాక్కుంటారని సబ్‌కలెక్టర్‌కు తెలిపారు. తమకు ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతంలోనైనా ఇళ్ల స్థలాలతో పాటు వ్యవసాయ భూములు కేటాయిస్తే వెళ్లడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తమ గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు తమ నుండి రూ. లక్షలు వసూలు చేశారని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.



గ్రామస్తుల నుండి వసూలు చేసిన డబ్బుల వివరాలతో కూడిన జాబితా



సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఇటికల్‌పహాడ్ గ్రామస్తులు



సబ్ కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న గ్రామస్తులు

మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలి

- టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి



నవతెలంగాణ-దహెగాం

ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌టీ, పార్ట్‌టైం ఉద్యోగులకు మినిమం టైం స్కేల్(ఎంటీఎస్)ను వర్తింప చేయాలని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ పాఠశాలలను గురువారం సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌టీలకు నాలుగు నెలలుగా వేతనాలు అందలేదని, దసరా పండుగ దగ్గరికి వస్తున్న క్రమంలో వాళ్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదని, వెంటనే వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష, కేజీబీవీ, పట్టణ, యాజమాన్యాల గురుకులం, ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్‌టి, గెస్ట్ పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ 12 నెలల వేతనం మంజూరు చేయాలని, మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉన్న అన్ని రకాల సెలవులు వర్తింప చేయాలన్నారు. హెల్త్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తులసిరామ్, రోహిత్, మండల కోశాధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- ఎమ్మెల్సీ దండె విఠల్

నవతెలంగాణ-కౌటాల



క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచాయం చేసుకొని క్రీడాస్ఫూర్తిని చాటాలని కోరారు. కాగా ఈ పోటీలకు జిల్లా స్థాయి నుంచి 48 జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో విజేతగా కాగజ్‌నగర్ మైనారిటీ రెసిడెన్షియల్ మొదటి బహుమతి సాధించగా రెడవ బహుమతి ఏఎచ్‌ఎస్ మొగడ్‌దగడ్ సాదించింది. బాలికల విభాగంలో ట్రైబల్ వెల్ఫేర్ ఆసిఫాబాద్ మొదటి బహుమతి సాధించగా రెడవ బహుమతి సోషల్ వెల్ఫేర్ రెబ్బెన సాదించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా కమిటీ సభ్యులు గుర్తించి జిల్లా స్థాయికి ఎంపీక చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి గావుడె హనుమంతు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నారాయణ సింగ్, నానాజీ, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-జైపూర్

పాఠశాల తరగతి గదులతో పాటు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం భీమారం మండల కేంద్రాన్ని సందర్శించిన ఆయన పాఠశాల విద్యార్థులతో కలిసి శ్రమదానంలో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కల తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సతీష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలోని పంచాయతీలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ ఆదేశించారు. గురువారం ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి గోపాల్ నగర్ పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలలోని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, పంచాయతీల పరిసరాలను శుభ్రపరచాలన్నారు. రేచిని పంచాయితీలో ఎంపీఓ అనిల్ గ్రామపంచాయతీ సిబ్బందికి రూ.15 లక్షల బీమా వర్తించే విధంగా గ్రామపంచాయతీ నిధుల నుండి బీమా ప్రీమియంను చెల్లించారు. ఒక్కొక్కరికి రూ.755 బీమా సంస్థకు ప్రీమియం చెల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్ నగర్ పంచాయతీ సెక్రెటరీ వసంత, శ్రీనివాసు ఉన్నారు.

తాగు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

నవతెలంగాణ-జైపూర్

ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన నీటి సహాయకులు గ్రామ పంచాయతీల పరిధిలో తాగు నీటికి ఇబ్బందులు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఎంపీడబ్ల్యూ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామ మంచి నీటి సహాయకుడికి ప్రతి గ్రామ పంచాయతీ నుండి ఒక ఎంపీడబ్ల్యూ వర్కర్‌కు శిక్షణ తరగతులు నిర్వహించగా శిక్షణ పొందిన వారు నీటి సమస్య ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం స్వచ్ఛత హీ సేవాలో భాగంగా నిర్వహించిన శ్రమదానం చేశారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్ రావు, శిక్షణ పొందిన ఎంపీడబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు.



నేటి చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించే ఉద్దేశంతో ఇందిరా పార్క్ వద్ద నేడు నిర్వహించే చలో హైదరాబాద్ విద్యార్థి మహాగర్జన విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటి సభ్యుడు భీంరావ్ కోరారు. జిల్లా కేంద్రంలో చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య వ్యవస్థ అభివృద్ధి కావాలంటే ప్రతి మండలానికి రెగ్యులర్ విద్యాధికారి ఉండాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ ప్రాతిపదికన ఏంఈఓల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాలలో కొనసాగుతున్న గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి చలో హైదరాబాద్ విద్యార్థి మహాగర్జన నిర్వహిస్తున్నట్లు, దీనిలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు ఆకాష్, గణేష్, సాయి పాల్గొన్నారు.

నర్సరీ కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించాలి

నవతెలంగాణ-రెబ్బెన

నర్సరీ కార్మికులను సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించాలని కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.ఓదేలు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల నుండి గోలేటిలోని నర్సరీలో పనిచేస్తున్న మహిళ కార్మికులను సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించి, ఇటీవల సింగరేణి ప్రకటించిన లాభాల వాటాలో రూ. 5000 చెల్లించాలన్నారు. గుర్తింపు సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు కూడా సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకు వివక్ష చూపకుండా లాభాల వాటా రూ. 5000 ఇప్పించాలని కోరారు. సింగరేణికి వస్తున్న లాభాలలో కాంట్రాక్టు కార్మికుల శ్రమ కూడా ఉందని వివక్ష చూపకుండా అన్ని విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా అందరికీ చెల్లించాలన్నారు.

మెడికల్ కళాశాల విద్యార్థుల మొదటి ఫలితాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో ప్రారంభమైన మెడికల్ కళాశాలలో ఎంబీబీస్ చదువుతున్న మొట్టమొదటి బ్యాచ్ మొదటి సంవత్సరం ఫలితాలు విడుదలైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 99 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 88 మంది ఉత్తీర్ణత సాధించారని, వీరిలో ఇద్దరు డిస్టిక్షన్ సాధించగా, 25 మంది ఫస్ట్ క్లాస్, 61 మంది సెకండ్ క్లాస్ సాధించారని, 11 మంది ఫెయిల్ అయ్యారని పేర్కొన్నారు. అధ్యాపకులు లేక ఇబ్బందులు పడ్డ వైద్య విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడంతో ప్రిన్సిపాల్ సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింత మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయనున్నట్లు వివరించారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల చెల్లింపెప్పుడు..?



నవతెలంగాణ-జైపూర్

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నటువంటి ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల చెల్లింపు ఎప్పుడని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షులు సయింపు శ్రీనివాస్ రావు ప్రశ్నించారు. తపస్ సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ముదిగుంట గ్రామ పంచాయతీ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. రెండు సంవత్సరాల నుండి బిల్లు కోసం ఉపాధ్యాయులు ఎదురు చుస్తున్నారన్నారు. వెంటనే బిల్లులను విడుదల చేయడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా కార్యదర్శి మందడి సత్తి రెడ్డి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కర్నె నరహరి, టీవీకే ప్రసాద్ పాల్గొన్నారు.

అక్రిడేషన్ కార్డుల గడువు 3 నెలలు పొడిగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అక్రిడేషన్ కార్డుల గడువును మరో మూడు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. అక్రిడేషన్ కార్డుల గడువును 01 అక్టోబర్ నుంచి 31 డిసెంబర్ వరకు పొడిగిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీసీ సంస్థకు సమాచార పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

దీపావళి లాభాల బోనస్ రూ.లక్ష సాధించాలి

నవతెలంగాణ-రెబ్బెన

ఈనెల 29న కోల్ ఇండియా యాజమాన్యంతో జరిగే స్టాండర్డ్ కమిటీ సమావేశంలో జాతీయ సంఘాలు గట్టిగా పట్టుబట్టి సింగరేణి ఉద్యోగులకు రూ.లక్ష దీపావళి బోనస్‌ను ఇప్పించే విధంగా కృషి చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గోలేటిలోని టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుంచి కేవలం రూ.5, 6 వేలు మాత్రమే పెంచుతున్నారన్నారు. గత సంవత్సరం రూ.85000 మాత్రమే ఇవ్వడం జరిగిందని, ఈసారి పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచి రూ.లక్షకు తగ్గకుండా దీపావళి బోనస్‌ను సింగరేణికి ఉద్యోగులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరులు సమావేశంలో ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్, సెంట్రల్ కమిటీ నాయకులు మాంతు సమ్మయ్య పాల్గొన్నారు.

108 వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు

నవతెలంగాణ-సిరికొండ



మండలానికి చెందిన 108 వాహనాన్ని క్వాలిటీ చెకింగ్ అధికారి కిషోర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వామాట్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, పరికరాలు, మందులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. వాహనం కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఎంఈ రాజశేఖర్, ఈఎంటి కాశీనాథ్, పైలట్ గోపీనాథ్ పాల్గొన్నారు.

టివిటి గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని టవిటి గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలిన కోరుతూ గురువారం గ్రామస్తులు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పార్డి-బి గ్రామపంచాయతీ నుండి దాదాపు 15 కిలోమీటర్ల దూరం ఉన్నందున అభివృద్ధికి పనుల నిమిత్తం వెళ్లడం కష్టంగా ఉందన్నారు. గతంలో చాలా సార్లు కలెక్టర్లకు ప్రత్యేక గ్రామపంచాయతీ కావాలని విన్నవించుకున్నామని తెలిపారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు.



వీరనారి ఐలమ్మ పోరాటాలు స్ఫూర్తిదాయకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భూమి, భుక్తి, వెట్టి చాకిరితో పాటు రైతుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత ఐలమ్మ 129వ జయంతిని బీసీ సంక్షేమ శాఖ అధ్వర్యంలో అధికారికంగా నిర్వహించారు. పట్టణంలోని రిమ్స్ ఎదుట ఐలమ్మ విగ్రహానికి కలెక్టర్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ బలహీన వర్గాలు, రైతుల కోసం వీరనారి ఐలమ్మ చేసిన పోరాటం ఎనలేనిదని కొనియాడారు. రైతులకు భూమి హక్కు కోసం ఉద్యమించారని గుర్తు చేశారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మహిళల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరముందన్నారు. రైతుల కోసం ఐలమ్మ చేసిన పోరాటంతోనే నేడు ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేస్తుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంట నష్టం జరిగిన రైతులను కూడా ఆదుకునేలా చర్యలు చేపడుతుందన్నారు. ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తి, చరిత్రను భవి తరాలకు తెలియజేయడానికి ప్రభుత్వం జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు సంతోష్, దోబికాలనీ కౌన్సిలర్ భరత్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రజక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ...

రజక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. రిమ్స్ ఎదుట ఐలమ్మ విగ్రహం నుంచి బ్యాండ్ మేళాల నడుమ బైక్ ర్యాలీ ప్రారంభమైంది. ప్రధాన వీధుల గుండా తిరిగి ఐలమ్మ విగ్రహం వద్దకు చేరుకుంది.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో...

తెలంగాణ వీరనారి ఐలమ్మ 129వ జయంతి వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం రిమ్స్ వద్ద గల ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రోకండ్ల రమేష్, ఏఎంసీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజ్జగిరి నారాయణ, కుమ్ర రాజు, మాజీ ఎంపీపీ జగదీశ్, నాయకులు సంతోష్, ఉదయ్ కిరణ్, స్వరూప, కరుణ, తుమ్మల ప్రశాంత్ పాల్గొన్నారు.

ఐలమ్మ సేవలు మరువలేనివి..

తెలంగాణ తెగువను జాతికి చాటిన వీర మహిళా ఐలమ్మ సేవలు మరిచిపోలేనివని, వారి అడుగుజాడల్లో నడుద్దామని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఐలమ్మ విగ్రహానికి ఆదిలాబాద్ పార్లమెంటు నాయకురాలు ఆత్రం సుగుణ, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన జిల్లా అధ్యక్షులు సాయిచరణ్ గౌడ్, పట్టణాధ్యక్షులు గుడిపెల్లి నగేష్, ఎస్టీ సెల్ చైర్మెన్ సేడ్మకి ఆనంద్ రావు, మావల మండలాధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, సురేష్, నలిమేల నవీన్‌రెడ్డి, రహీం ఖాన్, నాగరాజు, గౌతమ్, కృష్ణరెడ్డి, పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...

వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితోనే ప్రభుత్వాలు నడువాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ అన్నారు. గురువారం ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారికంగా ఆర్ఎస్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఇండ్ల ఎల్లన్న, గుర్రం ఆశన్న, పోశెట్టి, నాయకులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ...

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ అని జిల్లా కేంద్రానికి చెందిన సామజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి అన్నారు. గురువారం ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐలమ్మ చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు చిక్కాల దత్తు, రజక సంఘం పట్టణ నాయకులు సంతోష్, ముస్కు వినోద్, నాయకులు ఉన్నారు.

ఐలమ్మ జయంతిలో మున్సిపల్ చైర్మెన్..

వీరనారి చిట్యాల ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమందర్ ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రతిరూపంగా నిలిచిందన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు

లోకేశ్వరం : తెలంగాణ వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతిని మండలంలోని ఆయా గ్రామాల్లో రజక సంఘం నాయకులు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా అమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ క్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ వీరనారి ఐలమ్మ అన్ని వర్గాల హక్కుల సాధన కోసం పోరాటం చేసిన వీరవనిత, ప్రజాస్వామ్యవాది అని పేర్కొన్నారు. సంపన్న వర్గాల ఆత్మగౌరవ ప్రతీకగా చిట్యాల ఐలమ్మ అందరికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో చిట్యాల ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

తలమడుగు : మండల కేంద్రంలో వీరనారి ఐలమ్మ 129వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మొదటగా చిట్యాల ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఇన్‌చార్జి ఎంఈఓ వెంకట్‌రావు పాల్గొని మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ జీవిత చరిత్రను తెలుసుకోవాలని ఆమె చేసిన పోరాటాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటాయన్నారు. భూస్వాములకు, నైజాం పరిపాలకుల గుండెల్లో పరుగులెత్తించిన ధైర్యశాలి అని తెలిపారు. పోరాటయోదులు చేసిన గొప్ప పోరాటాలను పుస్తక రూపంలో తీసుకురావాలని కోరారు. మండల రజక సంఘం నాయకులు జక్కుల ఆశన్న మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడి బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచి పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి లింగన్న, భూమన్న, లింగన్న యాదవ్, అశోక్, లింగన్న, శివన్న, నరేందర్, రజక సంఘ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముథోల్ : వీరనారి చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని ఆమె ఆశయాలను కొనసాగించాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పిలుపు నిచ్చారు. గురువారం చిట్యాల ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని వీరనారి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణ తెగువ, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పి ఎందరికో ఆదర్శంగా నిలిచిందని అన్నారు. అర్హులైన రజక సంఘం సభ్యులకు రుణాలు, సంఘ భవనం, ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ముథోల్ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు భీమన్న, బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, హిందు ఉత్సవ సమితి అధ్యక్షుడు రోళ్ల రమేష్, గౌరవాధ్యక్షుడు ధర్మపురి సుదర్శన్, మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేష్, లక్ష్మి నారాయణ, పోతన్న యాదవ్, మాజీ సర్పంచ్ అనిల్, బీడీసీ అధ్యక్షులు నారాయణ, నాయకులు నర్సగౌడ్, సాంఫ్లీ రమేష్, తాటివార్ రమేష్, సతీష్‌రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, జీవన్, రజక సంఘ సభ్యులు మహేష్, శ్యామ్, బాలు, జలన్న, రమేష్, నర్సయ్య, సైదన్న, గంగాధర్, గ్రామస్తులు, రజక సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తామని, అందుకు ధర్మ సమాజ్ పార్టీ కృషి చేస్తుందని మండల కోఆర్డినేటర్ సర్కిల్ నరేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య మాట్లాడుతూ ఆధిపత్య వర్గాల పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి దొరలను గడీల నుంచి ఉరికించి, తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడిన వీర వనిత చాకలి ఐలమ్మ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటంలో పాల్గొన్న వారిలో అగ్రగణ్య ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు శ్రీనివాస్, బాలాజీ, కాంగ్రెస్ నాయకులు పాండురంగ్, శివుడు, జగన్, వినోద్, సంతోష్, ధర్మ సమాజ్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాకేష్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : వీరనారి ఐలమ్మ అడుగు జాడల్లో నడువాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో చిట్యాల ఐలమ్మ జయంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ముందుగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, ప్రపంచానికి చాటిన దీరవనిత, సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

నిర్మల్ : వీరనారి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మరువలేనిదని జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చిట్యాల ఐలమ్మ 129వ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె పోరాట స్ఫూర్తి మరువలేనిదని గుర్తు చేశారు. నాటి కాలంలోనే దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి తెలంగాణా పోరాటాల చరిత్రలో ఒక గొప్ప అధ్యయనాన్ని లిఖించిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, కుల సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చోడ : మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రజక సంఘం సభ్యులు ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు అరుగుల గణేష్, ఉపాధ్యక్షులు నాగరాజ్, కోశాధికారి గంగాధర్, భూమన్న, శేఖర్, అనిల్, సురేష్, రాజు, ప్రవీణ్, సాయి, ప్రణయ్ పాల్గొన్నారు.

బోథ్ : మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రజక సంఘం సభ్యులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరనారి చిట్యాల ఐలమ్మ పాత్ర మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు నీళ్ల లింగారెడ్డి, కట్ట భూమేష్, రజక సంఘం అధ్యక్షుడు చిలుకూరి భోజన్న, ఉపాధ్యక్షులు సోమనపల్లి రమేష్, గౌరవాధ్యక్షుడు సాకేరపు రమేష్, కోశాధికారి లోస్రం నరేష్, ప్రధాన కార్యదర్శి చిలుకూరి సతీష్, రజక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నస్పూర్ : తెలంగాణ సాయుధ పోరాట వీరనారి ఐలమ్మ జీవితం అందరికీ



స్ఫూర్తిదాయకమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, రజక సంఘాల నాయకులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ విముక్తి ఉద్యమంలో నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి పొందేందుకు సాగుతున్న పోరు ఐలమ్మ చేరికతో అణగారిన వర్గాల అభ్యున్నతి, భూమి కోసం, భుక్తి కోసం రైతాంగ సాయుధ పోరాటంగా రూపుదాల్చిందన్నారు. వీర వనిత ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి దిశానిర్దేశం చేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిపిందని, బడుగు బలహీన వర్గాల కోసం, దుక్కి దున్నే వాడిదే భూమి అనే నినాదంతో భూస్వాములకు, రజాకార్ల అఘాయిత్యాలకు, ఆగడాలకు ఎదురు నిలిచిందన్నారు. వీరనారి ఐలమ్మ వర్ధంతి, జయంతి సభలను ప్రభుత్వం అధికారికంగా చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షులు తంగలపెల్లి బాపు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు తంగళ్లపెల్లి వెంకటేశం, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జైపూర్ : రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమ కెరటం, తెలంగాణ వీర ధీర వనిత ఐలమ్మ అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. చిట్యాల ఐలమ్మ 129వ జయంతిని గురువారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి పోరాటలను గుర్తు చేసుకున్నారు. రజాకార్ల అరాచకాలపై ఎదురు తిరిగి ఎర్రజెండా చేతబూని మహిళా లోకానికి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోఠిలోని మహిళా కళాశాలకు ఐలమ్మగా నామకరణం చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొక్కుల నరేష్, బూనేని సుధాకర్, సూరం శ్యాంసుందర్ రెడ్డి, తైనేని రవి, మంతెన సమ్మయ్య, వడ్లకొండ మల్లేష్, కోట రవి, జంగిలి గట్టయ్య పాల్గొన్నారు.

జన్నారం : వీరనారీ ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం మండల కేంద్రంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం మండల కార్యదర్శి, రజక సంఘం మండల అధ్యక్షుడు ముక్కెర మల్లేష్, బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ కే ఏ నరసింహులు, ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోదూరి చంద్రయ్య, మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ బాలసాని, శ్రీనివాస్ గౌడ్, మోకుదెబ్బ, మంచిర్యాల డివిజన్ అధ్యక్షుడు ఒల్లాల నరస గౌడ్, మున్నూరు కాపు సంఘం పొన్కాల్ పట్టణ ఉపాధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, ముదిరాజ్ మండల సంఘం ఉపాధ్యక్షుడు రవి మురళి, రాజబాబు, రిటైర్డ్ టీచర్ బి.చంద్రయ్య, పోచ గౌడ్ పాల్గొన్నారు.

దండేపల్లి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రజక సంఘం నాయకులు పుట్టపాక తిరుపతి, కటుకూరి రాజన్న మాట్లాడుతూ కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ పేరును పెట్టడం సంతోషకర విషయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చిత్రపటాలకు పాలభిషేకం చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.











